# ఇల్లాలూ - లాజిక్కూ

ప్రతీ గొప్పవాడి వెనకాతల ఓ స్త్రీ ఉంటుంది. స్త్రీలు చేసే ప్రతి పని వెనకాతల బోలెడంత ఆలోచన ఉంటుంది. మీరు నేను గొప్పవాళ్లం అన్న విషయం మీరు, నేను కూడా ఒప్పుకొంటాం. ఒప్పందం ఉంటే మీరు గొప్పవారని నేను, నేను గొప్పవాడినని మీరు, అటువంటిది లేకపోతే మీరు గొప్పవారని మీరు, నేను గొప్పవాడినని నేను ఒప్పుకొంటాం కదా! మీరు పెళ్లయ్యాక గూడ గొప్పవారిగా మిగిలిపోతే మీ వెనకాతల స్త్రీ అక్కో, చెల్లో, తల్లో అవటానికి ఏ మాత్రం వీలులేదు. ఆ స్త్రీ మీ ఆవిడే అయి తీరుతుంది.

నేను ఇంతో అంతో వ్రాయగలటానికి కారణం మా ఆవిడే. ఆవిడ చేసే పనులు నా రచనలకి ప్రేరణ. ఆవిడ చేసే పనుల వెనుకాతల ఎంతో ఆలోచన ఉంటుంది. పని ముందు మీ ఆవిడ ఆలోచించదా అని సిల్లీగా అడగకండి. ముందు ఆలోచించి ఓ నిర్ణయానికి వచ్చి ఆ నిర్ణయాన్ని అమలులో పెడ్తే వాళ్ళు రేషనలిస్టులు. ముందస్తుగా పని ఏదో అవసరపడి చేసి ఆ తరువాత అది చెయ్యడం ఎంతో సబబో ఆలోచించి చెప్పేవారు రేషనలైజేషనలిస్టులు. మొదటికోవకి చెందిన వారికంటే రెండో జాతి వారు ప్రగతి సాధిస్తారు. మా ఆవిడ రెండో రకం మనిషి. నేను మొదటి వర్గంలో చేరాలని పెళ్ళయిన మొదట్లో కొంత ప్రయత్నం చేయబోతే, "ఇల్లాంటి పిచ్చి పనులు చేస్తే మీరు గొప్పవారు కాలేరు. మీరు గొప్పవారు కాకపోతే మీ వెనకాతల నేనుండదలుచుకోలేదు" అని తెగేసి చెప్పింది.

మా ఆవిడ ఆలోచనా సరళి నన్ను ఆశ్చర్యచకితుడిని చేస్తూ ఉంటుంది. నా కావిడ ఓ అపూర్వ విశిష్ట వ్యక్తిగా అనిపిస్తుంది. ఈ విషయం నేను మా స్నేహితుల్తో అని చూసాను. వాళ్ళు మా ఆవిడేకాక వారి వారి భార్యలు కూడా గొప్ప వ్యక్తులేనని వారి భార్యల ఆలోచనా ధోరణులు కూడా అధ్భుతమైనవేనని తార్కాణపూర్వకంగా నాకు ఋజువు చేసి నన్ను ఒప్పించారు.

మీరు ఇంతవరకు గమనించి ఉండకపోతే శ్రద్ధగా గమనించండి. మీ ఇల్లాళ్లు కూడా గొప్ప ఆలోచనా పరురాళ్ళే అయిఉంటారు. అయితే ఏ కోణంలోంచి చూస్తే మీకు వారి బుద్ధికుశలత అర్థమౌతుందో మీ కనుభవం లేక తెలియక పోవచ్చును. తెలియచెప్పటానికి

కొన్ని మచ్చుతునకలు మీ ముందుంచుతున్నాను. ఈ వాక్యాలు నేను చంద్రబింబాననలకు సభక్తి పూర్వకంగా సమర్పించే నూలుపోగులు.

ఈ రచన చేస్తున్నప్పుడు, ఈ రచన గొప్ప రచన అవాలన్న ఉద్దేశంలో మా ఆవిడ నా వెనకాతల నిలబడింది. వ్రాసినంతవరకు చదివి, "గుడ్ బిగినింగ్" అంది. నా రచనని మెచ్చుకొంటోందనుకొని "థాంక్స్" అన్నాను. తన ఉద్దేశం అది కాదు. భార్యలకి భర్తలు కనీసం దారపుండ లివ్వటం మొదలుపెడ్తే రిటైరయ్యే నాటికైనా చీరలు కొనే స్థితికి ఎదుగుతారని తన ఆశట. దారప్పోగులివ్వటం ఓ గుడ్ బిగినింగట. ఇక్కడ మీకో విషయం చెప్పాలి. మా ఆవిడ కున్న రెండువందల యాభై యేడు చీరలూ ఆవిడ పుట్టింటివారు పెట్టినవే! నేనింతవరకు తనకి ఓ గుడ్డ ముక్కైనా కొనిపెట్టి ఎరగనుట. ఇదంతా ధైర్యంగా మీతో ఎల్లా చెప్తున్నానంటే, ఇందాక మా ఆవిడ, టైము వేస్టవకుండా ఓ స్టవ్ మీద పోపుగరిట, మరో దాని మీద పాలగిన్నె పెట్టివచ్చి నా వెనకాతల నిలబడింది కదా! ఆ టైములో మొదటి దాంట్లో పోపు మాడింది. రెండో దాంట్లోని పాలు పొంగి పొయ్యిలో పడ్డాయి. ఆ సందర్భంగా లోపలికి వెళ్ళింది. ఆ రెండు పనులు తన కావాలనే చేసిందన్న విషయం నిర్వివాదాంశం. దాని వెనకాతల ఎంతో లోతైన ఆలోచన ఉంటుంది. వచ్చి చెప్తుంది. అంతవరకు, ఇంతకు పూర్వం ఆవిడ నుంచి నేను పొందిన జ్ఞానంలో పదో వంతు మీ ముందుంచనీయండి).

మా ఆవిడ పక్కింటి వనజగారితో కలిసి జయప్రద నటించిన సినిమా చూడటానికి వెళ్ళింది. గంట ముందే వెళ్ళి క్యూలో నిలుచున్నా వీళ్ళ వంతు రాకముందే టికెట్లు అయిపోయాయట. కాని ఇద్దరూ దర్జాగా సినిమా చూసి మరీ వచ్చారు. ఎట్లా? బ్లాక్‌లో టికెట్లు కొనుక్కుని. నేను బ్లాక్‌లో టికెట్లు కొనను. అది నా ప్రిన్సిపుల్. మా ఆవిడ కూడా కొనుక్కుని ఉండకుండా ఉండాల్సిందని నా అభిప్రాయం . "ఎందుకు కొన్నారు?" అని దండించే మేష్టారులాగా అడిగాను. "ఎందుకు కొనకూడదుట?" అని పాఠం అర్థంకాని విద్యార్థిలాగా వినయంగా అడిగింది మా ఆవిడ. 'నల్ల బజారు, నల్ల ధనం, పారలెల్ ఇకానమీ' అంటూ లెక్చర్ ఇచ్చి అవి దేశానికి నష్టం కనక అని చెప్పాను.

అప్పుడు మా ఆవిడ బట్టలకి మన్ను చేసుకున్న చిన్నపిల్లాడి కేసి తల్లి చూసినట్టుగా నన్ను చూసింది. "అయ్యో నా బుజ్జి శ్రీవారూ, మీ బుర్రకి మట్టి అంటుకొంది. కడుగుతాను ఆగండి" అన్న భావం స్ఫురించింది. నాకు అలక వచ్చింది.

"ఎందుకట్లా చూస్తావు?" అని అడిగాను, కొంచెం కోపంగాను, అది పూర్తిగా చూపించే ధైర్యం లేకుండాను.

"నేను వనజగారు మూడ్రూపాయలిచ్చి ఆటోలో వెళ్ళామా! మరో మూడ్రపాయలిచ్చి వెనిక్కి రావాలి. అంటే సినిమా చూడకుండా వస్తే మనిషికి మూడ్రూపాయలు వ్యర్థం. మేము సినిమా టికెట్లు ఒక్కొక్కటి రెండ్రూపాయలు మాత్రమే ఎక్కువ పెట్టుకొని చూసాం. అంటే సినిమా చూసిన ఆనందం నాకు, రూపాయి లాభం మీకు వచ్చాయి. ఇంకపోతే దేశం అంటే ఏమిటండీ? గురజాడగారు చెప్పనే చెప్పారు మనుష్యులని. ప్రతి మనిషి తనని తాను

సంస్కరించుకొంటూ పోతే దేశం అదే బాగు పడ్తుంది అని గాంధీగారన్నారని మీరే అంటూ ఉంటారు. అంటే ప్రతి మనిషి తన బాగు చూసుకొంటూపోతే మనుష్యులంతా బాగుపడ్తారు. అప్పుడు దేశం బాగుపడ్తుంది. అవునా?" అని తన ఆలోచనా ధోరణితో నన్ను ముగ్ధుడిని చేసింది.

మొదట్లో అంటే నేను బడుద్దాయిగా ఉన్న రోజుల్లో ఆ జయప్రద సినిమా మా ఆవిడ చూడకపోతే , టికెట్టు డబ్బులు, ఆ పిల్ల సినిమాలో కట్టుకొన్న నల్లబోర్డర్, తెల్లపువ్వులు ఉన్న ఎర్రచీర లాంటిది మా ఆవిడ కొనటానికైన మూడు వందల రూపాయలు మిగులును కదా అని అని ఉండేవాడిని. ఇప్పుడు నేను ఉజ్వలమతియైన మా ఆవిడ సన్నిధి నించుక బోధశాలి నయ్యాను. నా మంద బుద్ధి హరించుకు పోయింది. నిజానికి పక్కింటి వనజగారి సంగతీతేచూడాలి మీరు, నాగేశ్వరరావు ప్రక్కన స్టెప్పులు వేస్తున్న సీన్లో జయప్రద నీలం పట్టుచీర - అసలు జరీ బుటా ఉన్నది కట్టుకొంది. వనజగారు అది చూసి అటువంటిది కొనుక్కుంది, ప్రక్కింటి సుబ్బారావుగారి ప్రక్కన ఆవిడ వాళ్ళ పెళ్ళిలో తప్ప మళ్ళీ స్టెప్పులు వేయకపోయినా మా ఆవిడ పొదుపరి కనుక వెంటగిరి చీరతో సరిపెట్టుకొంది. ఇంతకూ ఆవిడ ఎర్రచీర కట్టిన దెవరికోసం-నా కోసమే కదా! నా నేత్రానందం విలువ ఎన్ని వందలు? చీర అన్నాక కొన్నాక ఒకసారే కట్టుకోరు కదా! స్టెయిన్‌లెస్ స్టీలు వాడికిచ్చేలోపల ఓ పది సార్లయినా కట్టుకొంటారు. అంటే నేత్రానందపు లాభాన్ని పది చేత గుణించాలి. చూశారా నా కంతా లాభమే! మీ ఆవిడ ఓ మంచి చీర కొంటె మీకంతా లాభమే! మరో సంగతి వినండి.

మా ఇంట్లో ఇద్దరికి సరిపోయే సెట్లు, నలుగురికి కావాల్సిన సెట్లు, ఆరుగురికి సరిపడే సెట్లూ అంటూ స్టెయిన్‌లెస్ స్టీలు కంచాలు గ్లాసులు, కాఫీ కప్పులు ఉన్నాయి. అల్లా ఉండటం వెనకాతల బోలెడు ఫిలాసఫీ ఉంది. మీ ఆవిడ పెళ్ళయినప్పుడు మీ ఇంట్లో ముచ్చటగా మీరిద్దరే కనక పుట్టింటినుంచి మా ఆవిడలాగానే ఇద్దరికి సరిపడే సారె తెచ్చి ఉంటుంది. మీ సంసారం పెరిగాక చుట్టాల, స్నేహితుల తాకిడికి అవసరమై ఆరుగురికి సరిపడేసెట్టు మీచేత కొనిపించింది ఆవిడ. అంతవరకు మీరు నోరెత్తరు. ఓరోజున ఉన్నంట్టుండి ఆవిడ నలుగురికి సరిపడే సెట్లు పక్కవీధిలో పెట్టిన హోల్‌సేల్ స్టెయిన్‌లెస్ స్టీలు షాపు నుంచి కొనుక్కుని వస్తుంది. మీరు దుర్వాసముని అవతారం ఎత్తుతారు. అది మీ ఆవిడ ఇంపల్స్‌లో కొందని మీ అభిప్రాయం, నేనూ మా ఆవిడ విషయంలో ఇల్లాగే అపార్థం చేపసుకొన్నాను.

నాలుగు రోజులు పోయాక మా ఆవిడ నాకు తాంబూలం ఇస్తూ చెప్పింది ఓరాత్రి.

"మనం ఇద్దరం మన కిద్దరు అంటే మొత్తం మన కుటుంబసంఖ్య నాలుగు. అందుకని నలుగురికి సరిపడే సెట్ కొన్నాను."

"ఆరుగురి సెట్ నలుగురికి వాడ్తే మాలతీ చందూర్ వద్దంటుందా?"

"ఆవిడెందుకంటుందండీ! ఆరు శాల్తీల సెట్‌లో నాలుగు తీసి వాడ్తాం అనుకోండి. అందులో కొన్ని ఎక్కువ అరుగుతాయి. ఎక్కువగా పాతబడ్తాయి. మిగిలిన రెండు ఎక్కువ కొత్తగా ఉంటాయి. మీ కొలీగ్స్ అయిదుగురు భోజనానికి వస్తారు. ఇందులో కాస్త కొత్తగా

ఉన్న పళ్ళాలు ఎవరికి పెట్టినా బంతిలో బలపక్షం అయిపోతుంది కదా! అందుకని నిత్యం వాడుకోడానికి ఈ నలుగురి సెట్ కాకుండా మరో ఆరుగురి సెట్ కొనొచ్చుననుకోండి. కాని మీకు అనవసరపు ఖర్చు అని ఆవిడ నా ఖర్చు పట్ల కన్‌సర్న్ చూపించింది. నేను కరిగిపోయాను. అటువంటి పరిస్థితుల్లో మీరూ కరిగిపోతారు. కరగకపోతే మీరు బండబ్బాయి.

ఇల్లాళ్ళు కొన్నిసార్లు కొన్ని పనులు చేసి "ఎందుకల్లా చేసావ్?" అని మనం నిలదీసినప్పుడు "ఆలోచించ లేదండీ" అంటూ అబద్ధం ఆడేస్తారు, అవి జాగ్రత్తగా ఆలోచించీ పథకం ప్రకారం చేసిన పన్లయినా సరే. దానికి మరో ఉదాహరణ చెప్పి ముగిస్తారు.

మా ఆవిడ పక్కింటి వనజగారితో బజారుకు వెళ్ళి ఎన్నోసార్లు నాతో ముందు చర్చింపకుండా తనంతట తాను నిర్ణయాలు తీసుకొని తనికి తోచినవి కొని తీసుకొని రావటం చేస్తూ ఉంటుంది కదా. నేను మాత్రం వనజగారి మొగుడు సుబ్బారావుగారితో బజారువెళ్ళి మా ఆవిడకి ముందుగా చెప్పా పెట్టకుండా కొని తీసుకురాలేనా అని పౌరుషపడిపోయి ఓ శనివారం ఆయన్తో బజారుకు వెళ్ళాను. తీరా వెళ్ళాక ఇంటికేం కావాలో తెలియలేదు. గ్లాస్‌వేర్ ఇంట్లో లేదని గుర్తుకువచ్చి ఆ షాపుకు వెళ్ళి ఎన్నో చూసి, ఆఖరికి అందంగా ఉన్నాయని క్రిస్టల్‌గ్లాస్‌తో చేసిన రెండు బీరు మగ్స్ కొన్నాను. వాటిలో పొయ్యడానికి గాను ఓ చల్లని బీరు సీసా కొన్నాను. ఇంటికివెళ్ళాక సీసాలోది సుబ్బారావుగారికో మగ్గు ఇచ్చి నేనో మగ్గుడు పుచ్చుకున్నాను. మా ఆవిడ ఏమీ అనలేదు. మగ్గుడు బీరు నాకు బోలెడు ధైర్యం ఇవ్వగా... ...

"అందరూ ప్రతి శనివారం రాత్రి అన్నం బదులు టిఫిన్లు తింటారు కదా సుబ్బారావుగారూ! మనం నీళ్ళ బదులు ప్రతి శనివారం రాత్రి బీరు తాగుదాం" అన్నాను. ఆయన సరేనన్నారు. మా ఆవిడ చూస్తూ ఊరుకొందేగాని పెదవి విప్పి పన్నెత్తి ఓ మాట అనలేదు.

సరే శుక్రవారం వచ్చింది. ఆ రోజు ఆడవాళ్ళు భర్తల శ్రేయస్సు దృష్ట్యా తలంటుకొనేరోజు. మా ఆవిడ తలంటుకొంది. ఆవిడ తరువాత నేను బాత్‌రూమ్‌లోకి వెళ్ళిన నా నోటి నుంచి అప్రయత్నంగా "ఏమిటిది?" అన్నకేక వెలువడింది. సబ్బు పెట్టె రెండు అర్థభాగాల్లోను సున్నిపిండి, పసుపు ఉన్నందునా? కాదు - అవి ఎలప్పుడూ అల్లాగే సద్వినియోగపడ్తూ ఉంటాయి కొత్తేమీలేదు! మరెందుకు? నేను ముచ్చటపడి కొనుక్కున్న బీరు గ్లాసుల్లో ఒక దాంట్లో నూనె, మరో దాంట్లో కుంకుడు కాయలు వాటి రసం పోసి కనిపించాయి. కట్టుకున్న తువ్వాలుతో బయటికివచ్చి మా ఆవిడ మీద విరుచుకు పడ్డాను. ముందు అనాలోచితంగా పోశానంది. ఆ తరువాత, "నూనె పోయటం తప్పే! తిడ్తేదానికి తిట్టండి. కాని కుంకుడు కాయల రసం పోస్తే వచ్చిన నష్టం ఏమిటండీ! మీరు తాగే బీరు రుచి అదే కదా! మీరు తిట్టదలుచుకొన్నారు కనుక తిడ్తున్నారు. అంతేకాని నా తప్పుండి కాదు. నేను మరీ ఎక్కడ్నుంచో వచ్చిందాన్ని కదా!" అంటూ ముక్కు ఎగబీల్చింది. తెలివైన భర్తలు, భార్యలు ముక్కు ఎగబీల్చటం మొదలుపెట్టగానే ఎక్కడి వాదనలు అక్కడే వదిలిపెట్టి తెలివిగా తప్పుకొంటారు. నేను బాత్‌రూమ్‌లోకి తప్పుకొన్నాను. ఆ బీరు గ్లాసులెంత తోమినా నూనె కంపు, కుంకుడు

కాయల కంపు ఆ మర్నాడు కొడ్తూనే ఉన్నాయి. పైన సబ్బు వాసన కూడా జోడైంది. గ్లాసులు లేవని ఆ శనివారం బీరు కొనలేదు. ద్వితీయ విఘ్నం కలిగితే పని సక్రమంగా జరగదు కదా! మళ్ళీ నేను సుబ్బారావుగారు బీరు సీసా ఇంటికి తీసుకురాలేదు. మా ఆవిడ సాధించ దలుచుకొన్న ప్రయోజనం అంత తెలివిగా సాధించింది. ఆవిడ ఆ బీరుగ్లాసుల్లో ఆ నూనె, కుంకుడుకాయల రసం పొయ్యటం బాగా ఆలోచించి నిర్ణయించుకొన్న పథకం ప్రకారం చేసిన పనే. కొన్నిసార్లు ఆవిడ ముందు ఆలోచించి ఆపైన ఆలోచనని అమలులోపెడ్తూంది, అనటానికి ఇంకా ఏం నిదర్శనం కావాలి?

అదిగో మా ఆవిడ వంటింట్లోంచి వచ్చేస్తోంది. "ఏం చిట్టీ! నువ్వు ఇక్కడ నా వెనకాతల ఉండగా పోపు మాడినట్టుంది." అని మేలమాడాను.

"పోపు కావాలనే మాడ పెట్టాను. కూరల ధరలు మండిపోతున్నాయి. కొద్దిగానే కొన్నాను. మీకు పిల్లలకి సరిగా పడ్డిస్తే సరిపోవు. అందుకని కాస్త పోపు మాడితే మీరు పిల్లలు మారు వేసుకోరు కదా!" అంది. ఆహా నారీ!

"పాలు పొయ్యిలో పడ్డాయా! పొయ్యి మీద పెట్టి మర్చిపోయినట్టున్నావు!"

"పడ్డాయి! మర్చిపోలేదు. సిరిసంపదలు ఇంట్లో పొంగి పొర్లాలని ఆశిస్తూ పాలు పొయ్యిలో పడేలా పొంగబెట్టడం మన ఆచారం. గృహప్రవేశాలు జరిగినప్పుడు చూడలేదూ! ఇంట్లో లక్ష్మి తాండవించిటానికి మీరు ప్రయత్నించ రెల్లాగూ! అందుకని నాచేతిలో పని నేను చేస్తున్నాను' ' అంది.

సంపాదించటం రెండు చేతులా చెయ్యలేని నా అసమర్థతను ఆవిడ సున్నితంగా ఎత్తి చూపించింది. ఆవిడ పోపు మాడబెడ్తుందని ఏ మొహం పెట్టుకొని కేకలు వెయ్యను. మా ఇంట్లో అన్నింటా మా ఆవిడదే విజయం! మీ ఇంట్లో మీదే విజయం అని మీరంటే... నేను నమ్మతాను... మీరుత్త అబాద్దాల కోరని.

- *క్రోక్విల్ హాస్యప్రియ, '85*

★